# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

**అనారోగ్య సమస్యలతో 88వ ఏట తుదిశ్వాస**

- 2013లో 266వ పోప్‌గా బాధ్యతలు
- ఈ పదవి చేపట్టిన తొలి లాటిన్ అమెరికన్
- వివిధ దేశాధినేతలు, ప్రముఖుల సంతాపం



వాటికన్ సిటీ, ఏప్రిల్ 21: క్యాథలిక్ క్రైస్తవుల మత గురువు పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూశారు. కొంతకాలంగా న్యుమోనియా, ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 88 సంవత్సరాలు. పోప్ మరణవార్తను వాటికన్ ధ్రువీకరించింది. వినయ, విధేయతలు, పేదల పట్ల ప్రేమతో ప్రపంచాన్ని ఆకర్షించిన పోప్ ఫ్రాన్సిస్ పర్యావరణ మార్పులు, పెట్టుబడిదారీ విధానంపై విమర్శలతో సంప్రదాయవాదులకు దూరమయ్యారు. లాటిన్ అమెరికన్ దేశాల నుంచి పోప్ పదవికి ఎన్నికైన మొదటి వ్యక్తి ఆయన. పోప్ మరణవార్తతో రోమ్‌లోని అన్ని చర్చ్‌ల లోని గంటలను మోగించారు. వాటికన్ కామెర్‌లెంగో (చర్చి వ్యవహారాల తాత్కాలిక నిర్వాహకుడు) కార్డినల్ కెవిన్ ఫారెల్ వాటికన్‌లోని పోప్ నివాసమైన డోమస్ శాంటి మార్టా నుంచి ఆయన మరణవార్తను చదివి వినిపించారు. వాటికన్ కాలమానం ప్రకారం ఉదయం 7.35 గంటలకు రోమ్ బిషప్, ఫ్రాన్సిస్.. తండ్రి గృహానికి తిరిగి వెళ్లారు. ఆయన జీవితకాలమంతా ప్రభువు, చర్చి సేవలకే అంకితమయ్యారు' అని పేర్కొన్నారు. పోప్ ఫ్రాన్సిస్ ఫిబ్రవరి 14 నుంచి 38 రోజులపాటు దవాఖానలో చికిత్స పొందిన అనంతరం గత నెలలోనే డిశ్చార్జి అయ్యారు. మరణానికి కొన్ని గంటల ముందు కూడా ఆయన ఈస్టర్ పర్వదినాన భక్తులకు సందేశం ఇచ్చారు. వాటికన్ నగరంలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో కొన్ని వేల మంది ముందు కొచ్చిన ఆయన ఈస్టర్ సందేశమిచ్చారు. 'సోదర, సోదరీమణులారా ఈస్టర్ శుభాకాంక్షలు..' అని స్వయంగా పలికారు. అనంతరం ఆయన సందేశాన్ని ఆర్చ్ బిషప్ డియాగో రావెలి చదివి వినిపించారు. యుద్ధం జరుగుతున్న గాజా, ఉక్రెయిన్, సంక్షోభాలతో రగులుతున్న కాంగో, మయన్మార్‌లలో శాంతి నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు.

**తొలి లాటిన్ అమెరికన్ పోప్**

పోప్ ఫ్రాన్సిస్ మొదటి పేరు జార్జ్ మారియో బెర్గొగ్లియో.. ఆయన 1938లో అర్జెంటీనాలో జన్మించారు. 1969లో ఆయన ప్రీస్ట్‌గా బాధ్యతలు చేపట్టారు. 1998లో ఆర్చ్ బిషప్‌గా, 2001లో కార్డినల్‌గా ఎన్నికయ్యారు. పోప్ బెనడిక్ట్-16 ఆకస్మికంగా రాజీనామా చేయడంతో మార్చి 13, 2013లో ఫ్రాన్సిస్ 266వ పోప్‌గా ఎన్నికయ్యారు. పోప్ ఫ్రాన్సిస్ వాటికన్ సిటీలో చాలా మార్పులు, సంస్కరణలను ప్రవేశపెట్టారు. వాటికన్ బ్యాంక్‌లో ఆర్థిక సంస్కరణలు తెచ్చారు. చర్చి నిర్వహణ, పాలనలో పారదర్శకతను అమలు చేశారు. లైంగిక వేధింపుల వంటి కేసుల్లో చాలా కఠినంగా వ్యవహరించారు. అయితే స్వలింగ సంపర్కుల పట్ల ఆయన సానుకూల ధోరణి సంప్రదాయవాదుల్లో ఆయన పట్ల వ్యతిరేకతను సృష్టించింది. ఈ అంశం క్యాథలిక్ చర్చిలో వివాదాస్పదం కాగా.. 'దేవుడు తప్ప తాను న్యాయం తీర్చకూడదు' అని ఆయన వ్యాఖ్యానించారు. మరణశిక్షపై చర్చి వైఖరిని మార్చిన ఫ్రాన్సిస్ అన్ని పరిస్థితుల్లో అదే శిక్షను అనుమతించరాదని స్పష్టంచేశారు. అణ్వాయుధాలు కలిగి ఉండటం అనైతికత అని ప్రకటించారు. అరేబియన్ ద్వీపకల్పాన్ని సందర్శించి ఇస్లాం-క్రైస్తవ మతాల మధ్య ఐక్యతకు కృషి చేశారు.

**తొమ్మిది రోజుల్లో అంత్యక్రియలు**

పోప్ భౌతిక కాయానికి క్యాథలిక్ సంప్రదాయంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ తంతు తొమ్మిది రోజులపాటు కొనసాగనుంది. తొలుత ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం సెయింట్ పీటర్ బెసిలికాలో ఉంచనున్నారు. తొలి రెండు-మూడు రోజుల్లోనే వివిధ దేశాలకు చెందిన మత పెద్దలు, అధికారులు, కార్డినల్స్, దేశాధినేతలు పోప్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పిస్తారు. మూడు శవపేటికల్లో పోప్ భౌతిక కాయాన్ని ఉంచి ఖననం చేస్తారు.


**తీరని భారత క్యాథలిక్‌ల ఆశ**

పోప్ ఫ్రాన్సిస్ భారత్‌ను సందర్శించకుండానే కన్నుమూయడం భారతీయ క్యాథలిక్‌లను నిరాశపరిచింది. భారత్ నుంచి తాజాగా కార్డినల్‌గా ఎన్నికైన కేరళ మత బోధకుడు జార్జ్ జేకబ్ కూవకడ్ 2025లో పోప్ ఫ్రాన్సిస్ భారత్ వస్తారని పేర్కొన్నారు. పోప్ విదేశీ పర్యటనలను పర్యవేక్షించేది ఆయనే. కేరళలోని సైరో మలబార్ చర్చిలో నెలకొన్న ఓ వివాదాన్ని కూడా ఆయన పరిష్కరించలేకపోయారు. అయితే పోప్ ఫ్రాన్సిస్ తన పదవీకాలంలో ముగ్గురు భారతీయులకు పునీత హోదా కల్పించారు. 2014లో ఫాదర్ కురియాకోస్, సిస్టర్ యూఫ్రేసియా ఎలువతింగల్, 2019లో క్యాథలిక్ నన్, మరియం థ్రేసియాను సెయింట్ (పునీత)గా ప్రకటించారు.పోప్ మృతి సందర్భంగా భారత ప్రభుత్వం మూడు రోజులు సంతపా దినాలుగా ప్రకటించింది.

**భారతీయులపై చిరస్థాయిగా పోప్ ప్రేమ: మోదీ**

ఫ్రాన్సిస్ మృతి పట్ల ప్రధాని మోదీ ప్రగాఢ సంతాపం తెలిపారు. 'పోప్ ఫ్రాన్సిస్ పేదల పట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయతలను ప్రదర్శించారు. అత్యంత చిన్న వయసు నుంచి ఆయన క్రీస్తు ఆదర్శాలకు అంకితం అయ్యారు. పేద, అణగారిన ప్రజలకు సేవలందించారు. భారతీయుల పట్ల ఆయన ప్రదర్శించిన ప్రేమ, ఆప్యాయతలు ఎల్లప్పుడూ చిరస్థాయిగా నిలిచిపోతాయి. సమ్మిళిత, సర్వతోముఖ అభివృద్ధికి ఆయన ప్రేరణగా నిలిచారు' అని ఆయన కొనియాడారు.

## నువ్వు పెండ్లి చేసుకోకుంటే.. ప్రీస్ట్ అవుతా!



తన వినయం, సత్ప్రవర్తనతో కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న పోప్ ఫ్రాన్సిస్‌ఆధ్యాత్మిక ప్రయాణం చిన్నప్పుడు ప్రేమ విఫలం కావడం వల్ల జరిగి ఉండొచ్చని తెలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోతారు! చిన్నతనంలో తాను సరదాగా అన్న మాటలను భవిష్యత్తులో ఆయనే సాకారం చేసుకున్నారు! బ్యూనస్ ఎయిర్స్‌లోని మెంబ్రిల్లర్ వీధిలో ఆయన చిన్నతనంలో (12 ఏండ్ల వయసులో) తన కుటుంబంతో కలిసి నివసిస్తున్న రోజుల్లో తన పొరుగింట్లో ఉండే అమలియా డామెంటే అనే బాలికతో ప్రేమలో పడ్డారు! జార్జ్ తనకు రాసిన ప్రేమ లేఖ గురించి అమలియా గతంలో ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'నాకింకా బాగా గుర్తుంది. అతడు ఎరుపు రంగు పైకప్పు ఉన్న చిన్న తెల్ల రంగు ఇంటి చిత్రాన్ని గీసి నాకిచ్చాడు. మనం పెండ్లి చేసుకున్నప్పుడు ఈ ఇంటిని నేను కొంటాను. నువ్వు నన్ను పెండ్లి చేసుకోకపోతే, నేను ప్రీస్ట్(మతాచార్యుడు) అవుతా! అని అన్నాడు' అని ఆమె చెప్పారు. అయితే అవి పిల్ల చేష్టలు తప్ప మరేమీ కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ విషయం తెలిసి తన తల్లి తనను అప్పట్లో కోప్పడ్డారని ఆమె తెలిపారు. ఆ తర్వాత తామిద్దరం కలవకుండా తన తల్లిదండ్రులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని ఆమె వెల్లడించారు. ఆ తర్వాత తమ ఇద్దరి కుటుంబాలు వేర్వేరు ప్రదేశాలకు వెళ్లిపోయాయని చెప్పారు. ఆ తర్వాత ఎప్పుడూ జార్జ్‌ను కలవలేదని ఆమె తెలిపారు.

## పోప్ మరణం ప్రపంచ శాంతికి తీరని లోటు

**బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్**



హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తేతెలంగాణ): క్రైస్తవ మత ఆధ్యాత్మిక బోధకుడు, పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపాన్ని ప్రకటించారు. ప్రేమాభిమానాలతో, సుఖ శాంతులతో, విశ్వ మానవాళి జీవించాలని, జీసస్ బాటలో నడిచిన పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచ శాంతికి తీరని లోటని కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పోప్ మరణంతో బాధాతప్త హృదయులైన క్రిస్టియన్ మతస్థులకు, వారి అభిమానులకు, కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## కోట్లాది మందికి పోప్ మార్గదర్శకులు

**బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు**

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): విశ్వమానవ సౌభ్రాతృత్వం కోసం జీవితాన్ని ధారపోసిన పోప్ ఫ్రాన్సిస్ ఈ లోకాన్ని విడిచివెళ్లడం విచారకరమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తన సేవల ద్వారా కోట్లాది మందికి ఆయన మార్గదర్శకుడిగా నిలిచారని అభివర్ణించారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం సమస్త మానవాళికి తీరని లోటని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఎక్స్ వేదికగా ప్రార్థించారు. ప్రపంచానికి మానవత్వాన్ని పంచిన పోప్ మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఆయన మృతి క్యాథలిక్స్ సమాజానికి తీరనిలోటని అభివర్ణించారు. సామాజిక న్యాయం, పేదల పట్ల ప్రేమ, శరణార్థుల, మహిళల హక్కుల కోసం విశేష కృషి చేసిన పోప్ ఫ్రాన్సిస్ మరణం ఎంతగానో బాధించిందని తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ సమాజంలో ఎంతో మందికి ఆయన స్ఫూర్తి నింపారన్నారు.

## నకిలీ రూ.500 నోట్లతో జాగ్రత్త

- అసలైన వాటిలాగే ఫేక్ నోట్లు
- వాటిని గుర్తించడమూ కష్టమే
- కేంద్ర హోం శాఖ హెచ్చరికలు



ఢిల్లీ: దేశంలో నకిలీ నోట్ల చెలామణిపై కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. రూ.500 దొంగ నోట్ల చెలామణిపై దర్యాప్తు సంస్థలను అలర్ట్ చేసింది. దొంగ నోట్లు అచ్చం అసలు నోట్ల లాగానే ఉన్నాయని తెలిపింది. వాటిని గుర్తించడం కూడా కష్టంగా మారిందని పేర్కొంది. నిఘా పెంచాలని సీబీఐ, ఎన్ఐఏ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, సెబీ, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ లకు కేంద్రం ఆదేశాలు జారీచేసింది.

**'E'కి బదులు 'A'**

నకిలీ నోట్లు అచ్చం అసలైన నోట్ల లాగానే ఉన్నట్టు తెలుస్తున్నది. రెండింటి మధ్య చిన్నచిన్న వ్యత్యాసాలు మాత్రమే ఉన్నట్టు సమాచారం. నకిలీ నోట్లలో 'RESERVE BANK OF INDIA'లోని 'RESERVE' అనే పదంలో 'E'కి బదులు 'A' ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో నకిలీ నోట్లను గుర్తించేందుకు ప్రజలకు కేంద్రం, దర్యాప్తు సంస్థలు పలు సూచనలు ఇచ్చాయి. అందుకు ముఖ్యంగా ఐదు మార్గాలను సూచించాయి.

**నకిలీ నోట్లను ఎలా గుర్తించాలంటే..**

ఒరిజినల్ నోట్లలో ఈ కింది ఫీచర్లు ఉంటాయి. అవి లేకపోతే ఫేక్ నోట్లు.

- 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పదంలోని స్పెల్లింగ్‌ను స్పష్టంగా పరిశీలించాలి.
- అసలైన నోట్లపై సెక్యూరిటీ థ్రెడ్ ఉంటుంది. నోటును కొంచెం పక్కకు తిప్పితే అది ఆకుపచ్చ రంగు నుంచి నీలంలోకి మారుతుంది. అంతే కాదు, దానిపై 'భారత్, ఆర్‌బీఐ' అనే పదాలు ఉంటాయి.
- నోటును వెలుతురులో గమనిస్తే మహాత్మాగాంధీ వాటర్‌మార్క్ కనిపిస్తుంది. ఎలక్ట్రోటైప్ వాటర్‌మార్క్ రూపంలో 500 అంకె కనిపిస్తుంది.
- అసలైన రూ.500 నోట్లలో మహాత్మాగాంధీ ఫొటో, అశోక స్థూపం, ఐడెంటిఫికేషన్ మార్క్ లాంటి కీలకమైనవి ఇంటాగ్లియో ప్రింటింగ్‌లో (ఉబ్బినట్టుగా లేదా ఎత్తుగా) ఉంటాయి.
- ఆర్‌బీఐ మొబైల్ యాప్ మని(ఎంఏఎన్ఐ)లో చెక్ చేసుకోవచ్చు. లేదా యూవీ లైట్‌లో చెక్ చేస్తే సెక్యూరిటీ థ్రెడ్, సీరియల్ నంబర్ లాంటివి మెరుస్తాయి.

## భారత్‌లో వాన్స్ దంపతులు

న్యూఢిల్లీ: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్ భారత పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా జేడీ వాన్స్‌తో ప్రధాని నరేంద్రమోదీ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై విస్తృత చర్చలు జరిపారు. చర్చల అనంతరం ప్రధాని మోదీ వాన్స్ దంపతులకు విందు ఇచ్చారు. కాగా వాన్స్ దంపతుల ముగ్గురు పిల్లలు భారతీయ సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు.



న్యూఢిల్లీలో అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించిన జేడీ వాన్స్ కుటుంబం

**'జేడీ వాన్స్ గో బ్యాక్'**

వ్యవసాయం, పాడిపరిశ్రమ, చేపలు పట్టడంలో అమెరికాతో భారత్ అసంబద్ధ ఒప్పందాలు చేసుకుంటే దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. జేడీ వాన్స్ భారత పర్యటనకు వచ్చిన సందర్భంగా సోమవారం హైదరాబాద్ సుందరయ్య పార్క్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

## ఫ్యూన్ ఉద్యోగాలకు 25 లక్షల దరఖాస్తులు

- పోటీలో పీహెచ్‌డీ స్కాలర్లు, యూపీఎస్సీ ఆశావహులు
- బీజేపీ పాలిత రాజస్థాన్‌లో ఇదీ నిరుద్యోగ పరిస్థితి

**డబుల్ ట్రబుల్ ఇంజిన్**

జైపూర్, ఏప్రిల్ 21: బీజేపీ పాలిత రాజస్థాన్‌లో 53,749 ఫ్యూన్ ఉద్యోగాల కోసం 24.76 లక్షల మందికి పైగా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పీహెచ్‌డీ, ఎంబీఏ, లా డిగ్రీలు ఉన్న వారితోపాటు సివిల్ సర్వీసెస్ కోసం తయారవుతున్న ఆశావహులు కూడా ఉండడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే ఒక్కో ఉద్యోగానికి 46 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నట్లు అర్థమవుతోంది. దరఖాస్తుదారులలో అత్యధికులు ఉన్నత విద్యావంతులే. జైపూర్‌లోని గోపాల్‌పురా ప్రాంతంలోగల కోచింగ్ సెంటర్ల వద్ద పలువురు అభ్యర్థులు ఫ్యూన్ పోస్టుల కోసం తాము ఎందుకు దరఖాస్తు చేయవలసి వచ్చిందో మీడియాకు వివరించారు. 2018 నుంచి తాను పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్నానని ఎంఏ, బీఈడీతో పాటు ఐటీ కోర్సులు చదివిన కమల్ కిషోర్ అనే అభ్యర్థి తెలిపాడు. ఇప్పటి వరకు తాను ఏ పరీక్షలో విజయం సాధించలేకపోయానని, ఏ ఉద్యోగం రాకపోతే నిరుద్యోగిగా మిగిలిపోవడం కన్నా ఫ్యూన్ ఉద్యోగం దొరకడం అదృష్టమేనని అతను వ్యాఖ్యానించాడు. సైన్స్‌లో పీజీ పూర్తి చేసిన తనూజా యాదవ్, ఎంఏ, బీఈడీ చదివిన సమిత్రా చౌదరి కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాజస్థాన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ పరీక్షల కోసం తయారవుతున్న వీరిద్దరూ ప్రభుత్వ కార్యాలయంలో నీళ్లు ఇచ్చే బంట్రోతు ఉద్యోగమైనా సరే సుస్థిరమైన ప్రభుత్వ ఉద్యోగంలో చేరే అవకాశాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదులుకోరాదని భావిస్తున్నారు.

**లక్షల్లో దరఖాస్తులు.. సైట్ క్రాష్**

లక్షల్లో దరఖాస్తులు రావడంతో ఆన్‌లైన్ దరఖాస్తుల వ్యవస్థ కూడా తట్టుకోలేకపోయింది. సైట్ పలుమార్లు క్రాష్ అయింది. రాజస్థాన్‌లో నిరుద్యోగ సమస్య తీవ్రతకు ఇది అద్దం పడుతున్నది. మరో ఉదాహరణ..ఫారెస్టు గార్డు పోస్టులకు వచ్చిన దరఖాస్తుల వెల్లువ. 2,399 పోస్టులకు 22 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఫ్యూను పోస్టుకు కనీస విద్యార్హత 10వ తరగతి కాగా ఉన్నత విద్యావంతులు సైతం దరఖాస్తు చేసుకున్నారని రాజస్థాన్ స్టాఫ్ సెలెక్షన్ బోర్డు కార్యదర్శి బాధల్ ధ్రువీకరించారు. 3 లక్షల మందికి మాత్రమే ఒకే సమయంలో పరీక్ష నిర్వహించగల సామర్థ్యం తమకు ఉందని, దరఖాస్తులను బట్టి చూస్తే 8 సార్లకు పైగా పరీక్ష నిర్వహించాల్సి వస్తుందని అన్నారు.



## ఇకపై నెలవారీగా నిరుద్యోగ డాటా

- మే 15 నుంచి ప్రారంభం
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

ముంబై, ఏప్రిల్ 21: దేశంలో నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో తెలిపే గణాంకాల్ని ఇకపై నెలవారీగా విడుదల చేయబోతున్నట్టు కేంద్రం వెల్లడించింది. కొత్త విధానం మే 15 నుంచి మొదలవుతుందని, ప్రతి నెలా నిరుద్యోగిత డాటాను విడుదల చేస్తామని కేంద్ర గణాంకాల శాఖ ఉన్నతాధికారి ఒకరు సోమవారం మీడియాకు తెలిపారు. మే 15న కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే డాటాలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల నిరుద్యోగిత గణాంకాలు ఉంటాయని చెప్పారు. కేంద్రం ఇప్పటివరకు.. త్రైమాసిక ప్రాతిపదికన పట్టణ నిరుద్యోగిత, వార్షిక ప్రాతిపదికన గ్రామీణ, పట్టణ నిరుద్యోగిత డాటాను కలిపి ఇస్తున్నది. నెలవారీగా డాటాను విడుదల చేయటం ఇదే మొదటిసారి.

## ఏఐతో లక్షల ఉద్యోగాలు గల్లంతు

వందేండ్లలో ఎన్నడూ చూడని పరిస్థితి • బిల్ గేట్స్, బరాక్ ఒబామా హెచ్చరిక



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: రానున్న కాలంలో కృత్రిమ మేధ(ఏఐ) వల్ల సంభవించే దుష్పరిణామాలపై మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆందోళన వ్యక్తం చేశారు. గడచిన 100 సంవత్సరాలలో ప్రజలు ఎన్నడూ చూడని విధంగా రానున్న సంవత్సరాలలో లక్షలాది ఉద్యోగాలను ఏఐ భర్తీచేయగలదని వారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అరుదైన మేధావులుగా పరిగణించే వైద్యులు, ఉపాధ్యాయులు వంటి నిపుణుల స్థానంలో ఏఐ ద్వారా ఉచితంగా సేవలు లభిస్తాయని బిల్ గేట్స్ తెలిపారు. ఏఐ వల్ల స్వల్పంగా భీతి కలుగుతున్నప్పటికీ సమస్యలను పరిష్కరించి, నూతన ఆవిష్కరణలకు మార్గం చూపగలదని ఆయన పేర్కొన్నారు. మరో వేదికపై ఒబామా మాట్లాడుతూ ఏఐతో ఏర్పడే ఆటోమేషన్ త్వరలోనే అన్ని రంగాల ఉద్యోగాలపై ప్రభావం చూపగలదని హెచ్చరించారు. దీంతో సంపాదనా మార్గాలపై ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వస్తుందని ఆయన చెప్పారు.

**వచ్చే దశాబ్దంలో టీచర్లు, డాక్టర్లకు ఏఐ ప్రత్యామ్నాయం**

రానున్న ఏఐ యుగం మేధస్సుపై సమాజంలో ఉన్న అభిప్రాయాలను ప్రాథమికంగా మార్చివేస్తుందని బిల్ గేట్స్ తెలిపారు. ఖరీదైనవని మనం ఇప్పటి వరకు భావిస్తున్న నైపుణ్య రంగాలు రానున్న కాలంలో ఉచితంగా మారిపోగలవని చెప్పారు. గొప్ప డాక్టర్లు, గొప్ప టీచర్లను మనం అరుదైన గొప్ప మేధావులుగా భావిస్తూ వచ్చామని, రానున్న దశాబ్దంలో ఏఐ వల్ల ఈ సేవలు ఉచితంగా మారిపోగలవని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేగాక డాక్టర్లు, టీచర్ల కొరతను కూడా ఇది తీర్చగలదని గేట్స్ తెలిపారు. ఏఐ వల్ల ఉద్యోగాల తీరులోనే పెను మార్పులు రాగలవని, వారానికి రెండు లేదా మూడు రోజులు పనిచేయాల్సి రావచ్చేమోనని ఆయన అన్నారు. మానవ వనరుల అవసరం ఇక ఉండే అవకాశం లేదా అన్న ప్రశ్నకు ఆయన జవాబిస్తూ ఉదాహరణకు బేస్‌బాల్ విషయమే తీసుకుంటే కంప్యూటర్లు ఆ ఆటను ఆడాలని కోరుకోమని, అదే విధంగా కొన్ని విషయాలు మనుషులు మాత్రమే చేయగలిగేవి ఉంటాయని గేట్స్ తెలిపారు. అయితే వస్తువుల తయారీ, వస్తువుల రవాణా, ఆహార ఉత్పత్తి వంటి విషయాలను ఏఐ చూసుకోగలదని ఆయన అభిప్రాయపడ్డారు.

**60-70 శాతం కోడర్స్ కన్నా మెరుగ్గా..**

అత్యంత వేగంతో ఏఐ ఎదుగుతున్న తీరు పట్ల బరాక్ ఒబామా ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఆటోమేషన్‌కు లేదా రోబోల సేవలకు మాత్రమే పరిమితం కాబోదని, అత్యున్నత స్థాయిలో మేధోపరమైన పని ఏఐ ద్వారా జరగనున్నదని ఒబామా అన్నారు. మెజారిటీ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ కన్నా అద్భుతంగా ప్రస్తుత ఏఐ నమూనాలు ఇప్పటికే పని చేస్తున్నాయని తెలిపారు. మంచి జీతాలు చెల్లించే హై స్కిల్డ్ ఉద్యోగాల విషయానికి వస్తే రానున్న కాలంలో ఆ పరిస్థితి ఉండకపోవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. తమ పనితీరును మెరుగుపరుచుకోవడానికి టాప్ ప్రొఫెషనల్స్ ఏఐని ఉపయోగించుకుంటారని, కాని సాధారణ ఉద్యోగాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతాయని ఆయన చెప్పారు.

## ఈ తప్పులు చేస్తే సహించేది లేదు

**8 సూత్రాలతో ట్రంప్ హెచ్చరిక**

వాషింగ్టన్: అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాలతో సంబంధం లేకుండా ఇతర రూపాలలో అమెరికాను మోసం చేసేందుకు ప్రయత్నిస్తే తమ మధ్య సంబంధాలు దెబ్బతినగలవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం తాజా హెచ్చరికలు జారీచేశారు. ఇందుకు సంబంధించి ఎనిమిది సూత్రాల జాబితాను ఆయన ప్రకటించారు. చైనాను మినహాయించి మిగిలిన దేశాలకు ప్రతీకార సుంకాల అమలుపై 90 రోజులపాటు అమెరికా ఉపశమనం కలిగించిన నేపథ్యంలో ట్రంప్ నుంచి తాజా హెచ్చరికలు వెలువడ్డాయి. అమెరికా ఉత్పత్తులు అంతర్జాతీయ విపణిలో ఖరీదు ఎక్కువగా ఉండేలా చేసి తమ వస్తువులను చౌకగా విక్రయించేందుకు తమ కరెన్సీ విలువను ఉద్దేశపూర్వకంగా తగ్గించరాదని ట్రంప్ హెచ్చరించారు. దిగుమతులపై వ్యాట్ కొనసాగించి ఎగుమతులపై ఆ సొమ్మును రిఫండ్ చేసే చర్యలను సహించబోమని స్పష్టంచేశారు. భారీ స్థాయిలో తయారుచేసి వాటిని ఇతర దేశాలకు కారు చౌకగా డంపింగ్ చేస్తే సహించబోమన్నారు. ఎగుమతులపై ప్రభుత్వాలు రాయితీ ఇవ్వరాదని స్పష్టం చేశారు. వీటితోపాటు నకిలీ వస్తువుల తయారీ, మేధో హక్కుల చౌర్యం, సుంకాలు తప్పించుకోవడానికి మరో దేశం నుంచి ఎగుమతి చేయడంతోపాటు జపాన్ నిర్వహించే బౌలింగ్ బాల్ టెస్ట్‌పై కూడా ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు.

## పార్లమెంటరీ విధుల్లోకి చొరబడుతున్నట్టు మాపై ఆరోపణలు

**సుప్రీంకోర్టు వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: న్యాయవ్యవస్థపై ఇటీవల జరుగుతున్న దాడులను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. పార్లమెంటరీ, కార్యనిర్వాహక విధుల్లో తాము చొరబడుతున్నట్టు తమపై ఆరోపణలు వస్తున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ సోమవారం వ్యాఖ్యానించారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిరసనల సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో చెలరేగిన హింసాకాండ నేపథ్యంలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టు ఆదేశాలపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్ర వ్యాఖ్యలు చేసిన క్రమంలో గవాయ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## బియ్యంలో ఆర్సెనిక్!

- వాతావరణ మార్పులే కారణం
- 2050 నాటికి ప్రపంచంలో 20% మందికి క్యాన్సర్ ముప్పు
- మధుమేహం, గుండె జబ్బులూ పెరగొచ్చు: తాజా అధ్యయనం



న్యూఢిల్లీ: వాతావరణ మార్పుల వల్ల బియ్యంలో ఆర్సెనిక్ స్థాయిలు పెరుగుతున్నాయని, క్యాన్సర్‌కు ప్రధాన కారకాల్లో ఆర్సెనిక్ ఒకటి అని శాస్త్రవేత్తలు తెలిపారు. 2050 నాటికి ప్రపంచంలో ప్రతి ఐదుగురిలో ఒకరు తమ జీవితంలో ఏదో ఒక దశలో క్యాన్సర్ బాధితులవుతారని చెప్పారు. ఈ అధ్యయన నివేదిక లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమైంది. ప్రపంచ ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల సెల్సియస్ పెరిగితే, నేల నిర్మాణంలో మార్పులు వస్తాయని, కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు పెరుగుతాయని ఈ అధ్యయనం తెలిపింది. ఈ పరిస్థితుల్లో వరి మొక్కలు ఆర్సెనిక్‌ను పీల్చుకునే శక్తి పెరుగుతుందని వివరించింది.

**వాతావరణ మార్పులతో..**

ప్రపంచవ్యాప్తంగా ఏటా 54 కోట్ల మెట్రిక్ టన్నుల వడ్లు పండుతాయి. దీనిలో 27 శాతం భారత దేశంలో పండుతుంది. ఆర్సెనిక్ స్థాయిలు పెరగడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. కొలంబియా విశ్వవిద్యాలయం, ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ ప్రొఫెసర్ లూయిస్ జిస్కా మాట్లాడుతూ, ఆసియాలో, ముఖ్యంగా ఆగ్నేయాసియాలో, వరి పండించే ప్రాంతాల్లో కాలుష్య కారకంగా ఆర్సెనిక్ అందరికీ సుపరిచితమేనని చెప్పారు. వాతావరణ మార్పులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయన్నారు. ఫలితంగా క్యాన్సర్, గుండె జబ్బులు వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు.

**క్యాన్సర్ ముప్పు..**

కలుషిత మట్టి, సాగునీటిలో ఆర్సెనిక్ ప్రధానంగా కనిపిస్తుంది. కార్బన్‌డయాక్సైడ్ స్థాయిలు పెరిగితే, వరి మొక్కల నిర్మాణం మారుతుంది. ఆర్సెనిక్‌ను పీల్చుకునే శక్తి వాటికి పెరుగుతుంది. ఆర్సెనిక్‌తో కలుషితమైన నీటిని అన్నం వండటానికి ఉపయోగించడం వల్ల ముప్పు మరింత తీవ్రమవుతుంది. 2050 నాటికి ఆసియా దేశాల్లో లక్షలాది మంది ఊపిరితిత్తులు, ప్రొస్టేట్ క్యాన్సర్ వంటి క్యాన్సర్లతో బాధపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అదే సమయానికి చైనాలో 1.34 కోట్ల ఆర్సెనిక్ సంబంధిత క్యాన్సర్ కేసులు నమోదుకావచ్చు. అంతేకాకుండా, గుండె జబ్బులు, మధుమేహం కూడా పెరగవచ్చు.

## 8 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్

- జార్ఖండ్‌లో ఘటన
- మృతుల్లో కోటి రివార్డున్న కేంద్ర కమిటీ సభ్యుడు, మరో ఇద్దరు కీలక నేతలు



వివేక్

కొత్తగూడెం ప్రగతి మైదాన్: మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన భీకరపోరులో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన జార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. జార్ఖండ్ డీజీపీ అనురాగ్ గుప్తా వెల్లడించిన వివరాల ప్రకారం.. బొకారో జిల్లా లాల్‌పానియా ప్రాంతంలోని లుగు గుట్టల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీస్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య దాదాపు రెండున్నర గంటలపాటు కాల్పులు కొనసాగాయి. ఘటనా స్థలం నుంచి 8 మంది మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఏకే-47, ఇన్‌సాస్ రైఫిల్, ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో రూ.కోటి రివార్డు ఉన్న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వివేక్ అలియాస్ పుచన అలియాస్ నాగ మాంఝీ అలియాస్ కరణ్ అలియాస్ లెతరతోపాటు రూ.25 లక్షల రివార్డు ఉన్న స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు అరవింద్ రావ్, రూ.10 లక్షల రివార్డు ఉన్న జోనల్ కమిటీ సభ్యుడు సాహెబ్‌రామ్ మాంఝీ ఉన్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. వివేక్ ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా తన కార్యకలాపాలను కొనసాగించేవాడని, జార్ఖండ్, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు దాడుల్లో కీలకంగా వ్యవహరించాడని పోలీసులు తెలిపారు.

## కంట్లో కారం చల్లి.. కత్తితో పొడిచి హత్య

- కర్ణాటక మాజీ డీజీపీ కేసు
- భార్య పల్లవి, కుమార్తె అరెస్ట్

బెంగళూరు: కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ (68) హత్య కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. పోలీసు వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం, ఆయన, ఆయన భార్య పల్లవి ఆదివారం ఆస్తి విషయంలో గొడవపడ్డారు. అనంతరం ఆమె ఆయన కంట్లో కారం పొడి జల్లి, ఆయనను కత్తితో అనేకసార్లు పొడిచింది. ఆయన చనిపోయిన తర్వాత తన ఫ్రెండ్‌కు వీడియో కాల్ చేసి, 'రాక్షసుడిని చంపేశాను' అని చెప్పింది. వీరు హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో మూడంతస్థుల ఇంట్లో నివసిస్తున్నారు. మరోవైపు పల్లవికి స్కిజోఫ్రేనియా వ్యాధి ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రకాశ్ భార్య పల్లవి, వారి కుమార్తె కృతిలను అరెస్ట్ చేశారు.